క్లుప్తంగా

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

భైంసాటౌన్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భైంసా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం భైంసాలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. పెండింగ్ డీఆర్, ఈ-కుబేర్ బిల్లుల చెల్లింపు, ప్రతినెలా ఒకటో తారీఖున పెన్షన్ చెల్లింపు, తదితర డిమాండ్లతో వినతిపత్రం అందించారు. అధ్యక్షులు నాగనాథ్, కార్యదర్శి భాస్కర్‌రావు తదితరులున్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్

సారంగాపూర్: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సోమవారం నిర్మల్‌రూరల్ సీఐ బి.శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఫిర్యాదులు, కేసుల వివరాలను ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎస్సై వసంత్, సిబ్బంది ఉన్నారు.

'ప్రైవేట్ పాఠశాలల్లో దోపిడీ అరికట్టాలి'

ఖానాపూర్: విద్యను వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలు వ్యాపార కేంద్రాలుగా మారాయన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక విద్యార్థులకు పుస్తకాలను అధిక ధరలకు అంటగడుతున్నారని వాపోయారు.

తడిసిన స్తంభాలను ముట్టుకోవద్దు

ఖానాపూర్: వర్షాకాలం నేపథ్యంలో తడిసిన విద్యుత్ స్తంభాలు, మీటర్లను ముట్టుకోవద్దని ఖానాపూర్ ఎస్సై ఆర్.శంకర్ సూచించారు. సోమవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో వర్షాలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంట్లో స్విచ్‌బోర్డులను చేతులతో ముట్టుకోకుండా పొడిగా ఉన్న కర్రలు, ప్లాస్టిక్ వస్తువులతో స్విచ్‌లు వేసుకోవాలన్నారు. చిన్నారులను కరెంట్ వస్తువులకు దూరం ఉంచాలని.. సమస్య ఉంటే విద్యుత్ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

సాహు మహరాజ్ జయంతి



నివాళులర్పిస్తున్న సొసైటీ సభ్యులు

భైంసాటౌన్: బుద్దిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా భైంసాశాఖ ఆధ్వర్యంలో సోమవారం రాజర్షి ఛత్రపతి సాహు మహరాజ్ 149వ జయంతి నిర్వహించారు. పట్టణంలోని రాహుల్‌నగర్‌లోని మైత్రేయ బుద్ధవిహార్‌లో సాహు మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సొసైటీ భైంసాశాఖ అధ్యక్షులు ప్రసంజిత్, ఏక్‌నాథ్, రాహుల్, గణేశ్ తదితరులు ఉన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8,9,10 తరగతుల విద్యార్థులకు సోమవారం పాఠ్యపుస్తకాలను ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.కిషన్ రావు, ఉపాధ్యాయులు భూమేష్, శ్రీనివాస్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం



మంత్రిని సన్మానిస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం పోలీస్‌శాఖకు టీటీఏ, టీఏ, ఇతర అలవెన్సులు పెంచుతూ జీవో జారీ చేసినందుకు మంత్రిని శాలువాతో ఘనంగా సన్మానించి పూలమొక్క అందించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

మామడ: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ ఆరిఫా తనిఖీ చేశారు. లబ్ధిదారులకు అందుతున్న వసతులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. బోధన తీరులో వినియోగిస్తున్న కృత్యాలను పరిశీలించారు. ఎంపీడీఓ రమేశ్, సూపర్‌వైజర్ శ్యామల, అంగన్‌వాడీ టీచర్ కమల, ఎంపీవో గోవర్ధన్ ఉన్నారు.

ప్రారంభమైన పఠనోత్సవం

- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



తానూరు: ఎల్వి పాఠశాలలో పుస్తక పఠనంలో విద్యార్థులు

తానూరు: మండలంలోని ఆయా పాఠశాలల్లో సోమవారం పఠనోత్సవం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎల్వి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు భూమన్న యాదవ్ మాట్లాడుతూ ఈనెల 26 నుంచి జూలై 1వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు చదవడం రాయడం తప్పనిసరిగా వచ్చేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్ ,సుజాతదేవి ,గంగారాణి ,తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచే ఉద్దేశంతో విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పఠనోత్సవం కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎంపీపీ మోహిద్ అన్నారు. సోమవారం మండలంలోని సత్తనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ పఠనోత్సవం ప్రారంభించారు. అనంతరం బడిబాటలో భాగంగా గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సయ్య, గ్రామస్తులు రాజేశ్వర్, రమేశ్, తిరుమలేశ్, గంగాధర్, తదితరులు ఉన్నారు.

సోన్: మండలంలోని న్యూవెల్మల్ జెడ్పీఎస్‌ఎస్ పాఠశాలలో సోమవారం పఠనోత్సవం ప్రారంభించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చక్రధర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠన సామర్థ్యాలను పెంపొందించేందుకు మూడు గ్రూపులుగా ధారళంగా చదివేవారు, ఆగి–ఆగి చదివేవారు, చదవలేనివారిగా విభజించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: పుస్తక పఠనంతో విద్యార్థుల్లో సృజనాత్మక పెరుగుతుందని మండలంలోని రాచాపూర్ మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్ పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో పఠనోత్సవంలో భాగంగా విద్యార్థుల చేత పలు అంశాలు చదివించారు. విద్యార్థులను గ్రూపులుగా విభజించి అందరూ చదివేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పెంబి: మండలంలోని మందపల్లి కేజీబీవీలో సోమవారం పఠనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా కలెక్టర్, మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న కె.వీణను సన్మానించారు. పదిలో వందశాతం ఫలితాలు సాధించినందుకు సిబ్బందిని సర్పంచ్ సుధాకర్, ప్రత్యేకాధికారి వీణ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుజాత, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.



ఖానాపూర్: సత్తనపల్లి పాఠశాలలో..



సోన్: న్యూవెల్మల్ ఉన్నత పాఠశాలలో..



రాచాపూర్‌లో విద్యార్థులతో ప్రిన్సిపాల్ సంతోష్

విత్తన ఎంపికే కీలకం

- ఒంటికన్ను విత్తనం మేలు
- దుబార చేయొద్దు.. పెట్టుబడి తగ్గించుకోవాలి
- పసుపు పంట సాగుకు జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్యాంరావ్ రాథోడ్ సూచన



విత్తన పసుపుకొమ్మును కోసి వేరు చేస్తున్న మహిళలు

లోకేశ్వరం: పసుపు సాగులో నాణ్యమైన విత్తనం ఎంపిక చేసుకుంటే మంచి దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్యాంరావ్ రాథోడ్ పేర్కొన్నారు. ఎకరం విస్తీర్ణంలో రెండు క్వింటాళ్ల విత్తనం సరిపోతుందని.. కాని రైతులు అవగాహన లేక ఆరు క్వింటాళ్ల పసుపు కొమ్ములను విత్తుకుంటూ నష్టపోతున్నారని అన్నారు. బలమైన కొమ్ములే ఏపుగా పెరుగుతాయనే నమ్మకంతో దొడ్డు విత్తనాన్ని.. అలాగే వేస్తుండటం వల్ల విత్తనం ఎక్కువ కావాల్సి వస్తుంది. విత్తన ఎంపిక నుంచే పాటించాల్సిన జాగ్రత్తలపై ఉద్యానశాఖ అధికారి పలు సూచనలు చేస్తున్నారు.

ఒంటికన్ను విత్తనం..

పసుపు కొమ్ముకు అనేక కణువులుంటాయి. ప్రతి కణువు దగ్గర ఓ కన్ను ఉంటుంది. కన్ను బాగుంటే కణువుల మధ్య కోసి వేర్వేరుగా విత్తితే మొలక వస్తుంది. ఒక్కో కొమ్ము ఎనిమిది మొక్కలు వచ్చేలా విత్తనం తయారు చేసుకోవచ్చు.

ఒంటి కన్ను విత్తనం విత్తినప్పుడు మొక్క సన్నగా వస్తుంది. కానీ నాలుగు నెలల తర్వాత బలిష్టంగా మారుతుంది.

విత్తనశుద్ధితో మేలు..

పసుపు కొమ్ములకు విత్తనశుద్ధి చేయకపోవడంతోనే రైతులు క్వింటాళ్ల కొద్ది విత్తుకుంటున్నారు. దీంతో పంటకు అనేక రకాల తెగుళ్లు సోకుతున్నాయి. ఒంటి కన్ను విత్తనం విత్తితే విత్తనం ఆదా కావడంతో పాటు పంటను తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చు.

విత్తనం ఆదా చేస్తే..

సాధారణంగా జిల్లాలో అనేక మంది రైతులు ఎకరాకు ఆరు నుంచి ఎనిమిది క్వింటాళ్ల వరకు పసుపు విత్తనాన్ని విత్తుకుంటారు. దీంతో రైతు గతేడాది పొందిన దిగుబడిలో 25 శాతం విత్తనాల కోసమే నిల్వ చేసుకోవాల్సి వస్తోంది. ఇలా ఎక్కువ విత్తనాన్ని విత్తడం వల్ల ఎకరాకు సుమారు ఎనిమిది క్వింటాళ్ల వరకు పసుపు వృథా అవుతోంది. సాధారణంగా రైతులు ఒక్క కొమ్మును రెండు ముక్కలు మాత్రమే చేసి విత్తుతారు. అలా విత్తడం వల్ల మొక్క లావుగా వస్తుంది. కానీ ఒంటి కన్ను విత్తనం కంటే అధికంగా రాదు. రైతులు తరచుగా విత్తన మార్పిడి చేసుకోవాలి. లేకపోతే పంటలో దిగుబడులు తగ్గి నష్టపోతుంటారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు గంగాప్రసాద్

భైంసాటౌన్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం భైంసాలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందూర్ విభాగ్ రాష్ట్ర కార్యదర్శి గంగాప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందించి వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌ఎఫ్‌డీ కన్వీనర్ ప్రకాశ్, భైంసా పట్టణ ఉపాధ్యక్షులు చంద్రకాంత్, యోగేశ్, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: సర్కారు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో అన్ని వసతులు కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. ఏబీవీపీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు సోమవారం పట్టణంతో పాటు మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బంద్ కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించడంతోపాటు నోట్‌బుక్‌లు, యూనిఫాంల విక్రయాల పేరిట చేస్తున్న బహిరంగ దోపిడీని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

'డబుల్' ఇళ్లు ఇచ్చారు.. కరెంట్ మరిచారు



కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని నాగనాథ్‌పేటలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇటీవల పేదలకు పంపిణీ చేశారు. కాని సదరు ఇళ్లకు తాగునీరు, కరెంట్, రోడ్డు వంటి కనీస సౌకర్యాల్లేక ఇబ్బంది పడుతున్నామని లబ్ధిదారులు నిరసన వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అధికారులు చెప్పిన ప్రకారం మాకు కేటాయించిన బ్లాక్‌లను శుభ్రం చేసుకున్నామని పేర్కొన్నారు. కనీస సౌకర్యాల్లేక మహిళలు, చిన్నపిల్లలు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారని.. ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించాలని వేడుకున్నారు.

ఉపాధ్యాయుల్ని నియమించాలి

సారంగాపూర్: మండలంలోని స్వర్ణ ఉర్దూ మీడియం పాఠశాలలో 65 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు ఉన్నాడని.. వెంటనే మరో ఇద్దరిని నియమించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ అన్నారు. సోమవారం డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. చందు, దిగంబర్ తదితరులు ఉన్నారు.

విధుల్లో చేరిన కడెం తహసీల్దార్

కడెం: కడెం తహసీల్దార్‌గా గజానన్ సోమవారం తిరిగి విధుల్లో చేరారు. గజానన్ సుమారు మూడు నెలలపాటు మెడికల్ లీవ్ తీసుకోవడంతో డీటీ చిన్నయ్య ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరించారు.

కిచెన్‌గార్డెన్లతో తాజా కూరగాయలు

సారంగాపూర్: వసతిగృహాల్లో ఏర్పాటు చేసే కిచెన్‌గార్డెన్లతో పోషకాలు కలిగిన కూరగాయలను విద్యార్థులకు ఆహారంగా అందించవచ్చని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని జామ్ సాంఘీక సంక్షేమశాఖ బాలికల గురుకుల విద్యాలయంలో సోమవారం కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసి అందులో వివిధ రకాల కూరగాయల మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీ సమయంలో వాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఏపీఓ లక్ష్మారెడ్డి, సర్పంచ్ మహిపాల్ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ రమాకల్యాణి తదితరులు ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజావాణి నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్మల్ బస్టాండ్ నుంచి కొత్త కలెక్టరేట్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింగరి వెంకటేశ్, ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి జీవారే రాహుల్ మాట్లాడారు. ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు దిగంబర్ పాల్గొన్నారు.

మొక్కలను సిద్ధం చేయాలి



రాంటెక్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

ముధోల్: మండలంలోని రాంటెక్ నర్సరీని సోమవారం ఎంపీడీవో సురేశ్‌బాబు పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున హరితహారంలో నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట ఏపీవో శిరీష, సర్పంచ్ వీజీ పటేల్ తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని అంజనీతండా నర్సరీని సోమవారం ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. అనంతరం సెగ్రిగేషన్ షెడ్డు, పల్లె ప్రకృతి వనం, పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సంస్కృతి పాల్గొన్నారు.

మార్కెట్ కార్యదర్శి బదిలీ

కుభీర్: మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా పని చేస్తున్న మధుసూదన్ బదిలీపై నిజామాబాద్‌కు వెళ్లారు. వారి స్థానంలో భైంసా మార్కెట్‌లో పని చేసే శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. సోమవారం మధుసూదన్‌కు మార్కెట్ సిబ్బంది, వ్యాపారులు ఘనంగా సన్మానించారు. భైంసా మార్కెట్ కార్యదర్శి అడెల్లు, సంతోష్, వ్యాపారులు సంతోష్, విఠల్, సాయినాథ్, రమేశ్, అప్సర్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు పూర్తి చేయాలి

నిర్మల్‌రూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్‌నాయక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలలు పునఃప్రారంభమైనా మారుమూల గిరిజన గ్రామాలు, తండాలు, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యావ్యవస్థ కుంటుపడుతుందన్నారు. పలుమార్లు విద్యాధికారులకు విన్నవించినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే)లో రూ.ఐదు లక్షలతో చేపట్టే కుమ్మరి సంఘం కార్యాలయ ప్రహరీ నిర్మాణ పనులకు సోమవారం డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి భూమిపూజ చేశారు. జెడ్పీటీసీ రాజేశ్వర్, సర్పంచ్ హైమావతి, బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, క్రిష్టారెడ్డి, సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీ గణేశ్, సర్పంచ్ గంగాధర్, గంగారాం, ముత్యం, నరేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

లోకేశ్వరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భోస్లే మోహన్‌రావు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని పిప్రి, నగర్ గ్రామాల్లో పల్లెపల్లెకు బీజేపీ గడపగడపకూ మోహన్‌రావుపటేల్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈసారి ఎన్నికలలో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సుభాశ్‌పటేల్, నరహరి, అనిల్, లింగాల పోతన్న, గోపాల్‌గౌడ్ ఉన్నారు.

145 మందికి రైతుబంధు వర్తింపు

కుంటాల: మండలంలోని విఠాపూర్, వెంకూర్, కుంటాల, ఓల, అంబకంటి, లింబా(కే) గ్రామాల్లో రెండేళ్ల కిందట ప్రాణహిత–చేవెళ్ల 27 ప్యాకేజీ కెనాల్‌లో 225 ఎకరాల భూమి ముంపునకు గురైందని ఏవో సోమలింగారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ముంపులో పోను మిగిలిన భూమికి చెందిన 145 మంది రైతులకు త్వరలో రైతుబంధు వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. సంబంధిత రైతులు పట్టాదారు పుస్తకం, ఆధార్, బ్యాంకు అకౌంట్ జిరాక్సులతో ఏఈవోలను సంప్రదించాలన్నారు. నెలాఖరు వరకు అవకాశం ఉందని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ రేఖ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వనజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

లోకేశ్వరం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సోలమాన్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, అధికారులు రావాలన్నారు.

నేడు రుణమేళా

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో మంగళవారం ఉదయం మహిళలకు రుణమేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎం భోజన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఆర్‌డీవో విజయలక్ష్మి, శోభ హాజరవుతారని ఆయన తెలిపారు.

పొలాలకు వెళ్లేందుకు రోడ్డు నిర్మించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

తానూరు: మండలంలోని ఝరి(బి) గ్రామం నుంచి పంట పొలాలకు వెళ్లేందుకు రెండు కిలోమీటర్ల మేర గ్రావెల్(కంకర) రోడ్డు నిర్మించాలని కోరుతూ రైతులు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. సోమవారం భైంసా మండలం దేగాం గ్రామంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఏటా వర్షాలు కురిస్తే పొలాలకు వెళ్లేందుకు ఇబ్బంది అవుతుందన్నారు. రోడ్డు బురదమయంగా మారుతుందని.. దీంతో పంటలను కూడా చేన్ల వద్దే నిల్వ చేస్తున్నామని పేర్కొన్నారు.ఎమ్మెల్యేను కలిసిన వారిలో మేకల దేవిదాస్, మాజీ సర్పంచ్ చాందు, శ్రీనివాస్, బాబు, లాలు, కైలాస్, సాయినాథ్ తదితరులు ఉన్నారు.

బక్రీద్ పండుగకు ఏర్పాట్లు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: ఈనెల 29న బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంలోని మసీదులలో అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతూ ఏఐఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏఐఎంఐఎం పార్టీ కౌన్సిలర్ ఎండి. ముజాహిద్ అలీ మాట్లాడుతూ పట్టణంలో ఉన్న 56 మసీదుల్లో పారిశుద్ధ్య పనులు చేయించి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రార్థనలు నిర్వహించే ఈద్గా వద్ద వాటర్ ప్రూఫ్ టెంట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎంఐఎం పార్టీ జనరల్ సెక్రెటరీ మజ్హర్, ఇర్ఫాన్ తదితరులు ఉన్నారు.


వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

మామడ: వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఆరిఫా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడంతో పాటు తాజా ఆహారం, కాచి చల్లార్చిన నీటిని తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అరుణ్‌కుమార్, ఎంపీడీవో రమేశ్, వైద్యాధికారి సామంత్, ఎంపీవో గోవర్ధన్, సీహెచ్‌ఓ లక్ష్మన్న, సూపర్‌వైజర్ కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. కాల్వలోంచి చెట్టు తొలగించరూ



లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో పద్మశాలీ కాలనీలో ఉన్న మురుగు కాలువలో భారీ వృక్షం పడిపోయింది. దీంతో మురుగునీరు ప్రవహించకుండా ఎక్కడికక్కడ నిలిచి దుర్గంధం వ్యాపిస్తోంది. వర్షాకాలంలో నిల్వనీటితో రోగాల ముప్పు ఉంది. అధికారులు స్పందించి కాల్వలోంచి చెట్టును తొలగించాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఫోన్: 75682 31737